ఉన్నత చదువు.. పోలీస్ కొలువు

బీటెక్.. ఎంటెక్.. ఎంఫార్మసీ..ఎంబీఏ వంటి కోర్సులు చదివిన వారు కార్పొరేట్ ఉద్యోగాలకు వెళ్లకుండా కానిస్టేబుల్ ఉద్యోగాల వైపు మళ్లారు. మల్టీనేషనల్ కంపెనీలు ఆహ్వానిస్తున్నా.. గవర్నమెంట్ నౌకరీపై మక్కువతో పరీక్షలు రాశారు. ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఉన్నత విద్యావంతులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో తల్లిదండ్రుల కల నెరవేర్చిన వారు కొందరైతే.. పరిస్థితులతో ఇటు వైపు వచ్చిన వారు మరికొందరు..

- 8లో▸



న్యూస్‌రీల్

10 కేసులు పరిష్కారం

పెద్దపల్లిరూరల్: కరీంనగర్ జైలులో శనివారం నిర్వహించిన జైలు అదాలత్‌లో జిల్లాకు సంబంధించిన 18 కేసులు పరిష్కారం అయ్యాయని పెద్దపల్లి సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్ తెలిపారు. ఇందులో 10మందికి శిక్ష, జరిమానా విధించామని పేర్కొన్నారు.

గోదాం తనిఖీ



పెద్దపల్లిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఈవీఎంలు భద్రపర్చిన గోదామును కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం తనిఖీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఆయన లోనికి ప్రవేశించారు. ఈవీఎంలు, వీవీప్యాట్లను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సూపరింటెండెంట్ బండి ప్రకాశ్, తహసీల్దార్ రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ: గ్రామాల్లో పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం పల్లె దవాఖానాలు ఉపయోగపడుతున్నాయని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రామగిరి మండలం ముస్త్యాలలో సర్పంచ్ లావణ్యతో కలిసి శనివారం ఆయన పల్లె దవాఖాన ప్రారంభించి మాట్లాడారు. పల్లెదవాఖానను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ సంపత్, సిబ్బంది ప్రదీప్‌కుమార్, ఎంపీటీసీ హేమలత, ఉపసర్పంచ్ వేణుగోపాల్, కార్యదర్శి పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



రామగుండం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ శుక్రవారం పాఠశాలను సందర్శించగా హెచ్‌ఎం అజ్మీరా శారద పాఠశాల ఆవరణ, క్రీడామైదానం శుభ్రం చేయించాలని విన్నవించారు. స్పందించిన కమిషనర్.. పారిశుధ్య కార్మికులు, జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మదర్‌గౌడ్, ఉపాధ్యాయురాలు అనిత తదితరులు పర్యవేక్షించారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు



సుల్తానాబాద్(పెద్దపల్లి): బతుకమ్మ, దసరా వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ తెలిపారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం బల్దియా కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడారు. తొలుత 9 అంశాలను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. బతుకమ్మ ఆడుకునే స్థలాలు, కూడళ్లు, నిమజ్జనం చేసే ప్రాంతాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని సునీతగౌడ్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్మన్ బిరుదు సమత, కౌన్సిలర్లు పసేడ్ల మమత, గాజుల లక్ష్మి, పారుపల్లి జ్ఞానేశ్వరి, కూకట్ల గోపి, చింతల సునీత, అనుమల అరుణ, తిరుపతి, రాజయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

ఇక 'సింగిల్‌విండో గేట్ పాస్'



జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో సింగిల్‌విండో గేట్ పాస్ సిస్టం శనివారం ప్రారంభించారు. రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు యూనిట్ ఓవర్ హాలింగ్ కోసం ఈ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ, కొత్త పద్ధతితో 8గంటల ప్రాసెస్‌ను 8 నిమిషాలకు తగ్గించామని, తద్వారా సమయం ఆదా అవుతుందన్నారు.

సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

మంథని: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా శనివారం పుట్టపాకకు సర్వే కోసం వెళ్లిన నేషనల్ గ్రీన్ ఫీల్డ్ అథారిటీ బృందం, ఆర్అండ్‌బీ అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలో చేసిన సర్వేలో పొరపాట్లు చోటుచేసుకున్నాయని, రీ సర్వే చేయాలని కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారులకు విన్నవించినా.. పాత జాబితా ఆధారంగా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

మీ ఎమ్మెల్యే ఏం చేశారు?



- ఎవరు గెలిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయి?
- జనం నాడీ పసిగట్టేందుకు పార్టీల యత్నాలు
- సొంత సర్వేలు చేయిస్తున్న అభ్యర్థులు
- హోరెత్తుతున్న 'పోల్' పోస్టులు

సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికలు డిసెంబర్‌లో జరుగుతాయనే ప్రచారం నేపథ్యంలో ప్రధాన పార్టీలు సర్వేల జపం చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించగా, మిగతా పార్టీలు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాయి. సర్వేల ఆధారంగా, ప్రజల్లో ఉన్న పలుకుబడి తెలుసుకున్నాకే టికెట్లు కేటాయిస్తామని ఇప్పటికే స్పష్టం చేశాయి. దీనికి అనుగుణంగా ఆయా పార్టీలు సర్వే చేస్తున్నాయి. మరికొందరు రెబల్ అభ్యర్థులు.. తాము పోటీలో ఉండాలా, వద్దా అనే విషయం తెల్సుకోవడానికి వివిధ సంస్థలతో సర్వే చేయిస్తున్నారు. దీనికితోడు బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థుల గ్రాఫ్ పెరిగిందా? లేదా తెలుసుకునేందుకు అధిష్టానం సర్వే చేయిస్తోంది. మరికొందరు సొంతంగానే లోకల్ ఫ్లేవర్‌తో సర్వే చేయించుకుంటున్నారు. మరోపక్క నియోజకవర్గ ప్రజల నాడీ తెలుసుకునేందుకు వారి మొబైల్, మేసేజ్‌ల ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నాయి పలు సర్వే సంస్థలు. వీటికి అదనంగా వాట్సప్, ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగామ్.. ఇలా ఏ సోషల్ మీడియా చూసినా ఇలాంటి పోస్టులే కనిపిస్తున్నాయి. పోస్టులతోపాటు రిపోర్టులు, వాటికింద అనుచరుల ఒపీనియన్లు, వాదోపవాదాలు, తిట్ల పురాణాలతో సామాజిక మాధ్యమాలను మోత మోగిస్తున్నారు.

నియోజకవర్గ ప్రజలు ఏం అనుకుంటున్నారు?

- అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్రంలో జరిగేవే అయినా.. ఆయా నియోజకవర్గాల్లో ముఖ్యమైన అంశాలు ఏమిటనే దానిపై సర్వే ఏజెన్సీలు ఫోకస్ చేస్తున్నాయి.
- నియోజకవర్గంలో పెండింగ్ అంశాలు, వాటిని పరిష్కరించడానికి ప్రస్తుత ఎమ్మెల్యే ఏం చేశారు? ఎవరు గెలిస్తే ఆయా సమస్యలు పరిష్కరించే ఆస్కారం ఉంది? అనే అంశాలపై ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నాయి.
- ప్రజలు చెప్పే సమాచారాన్ని, ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఎలక్షన్ క్యాంపెయినింగ్ ఏ డైరెక్షన్‌లో సాగాలి? ఎలాంటి అంశాలు ఎంచుకోవాలి? అనే దానిపై నేతలు కసరత్తు చేస్తున్నారు.
- వచ్చే ఎన్నికల్లో ఎంచుకోవాల్సిన ప్రచారాస్త్రాలు, ఇవ్వాల్సిన నినాదాలపై ఇప్పటికే అన్ని పార్టీల నేతలు కసరత్తు చేస్తున్నారు.
- ప్రజల ఆకాంక్షలు, అవసరాలనే ప్రచారాస్త్రాలుగా మలచుకోవాలని భావిస్తున్నారు.

ఒకటి నొక్కండి, లేదా రెండు నొక్కండి..

మొబైల్ ఫోన్లకు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్(ఐవీఆర్) ద్వారా 'మీరు ఏ పార్టీకి మద్దతు తెలుపుతారు.. మా పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇస్తారా' అని అడుగుతున్నాయి. 'మీరు ఫలానా ఆయనకు మద్దతు తెలిపితే ఒకటి నంబరు నొక్కండి. ఇంకొకరికి మద్దతు తెలిపితే 2, మరో ఆయనకు మద్దతు తెలిపితే 3 నంబరు నొక్కండి' అంటూ వారి పేర్లు చెబుతూ ఆన్‌లైన్ ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఓటర్లు ఫోన్లు ఎత్తకపోతే మళ్లీమళ్లీ చేస్తున్నారు. పూర్తిగా కాల్ విని నంబర్లను నొక్కిన తర్వాత మళ్లీ ఫోన్లు రావడం లేదని ఓటర్లు చెబుతున్నారు. అత్యధికంగా మద్దతు తెలిపిన అభ్యర్థులకే టికెట్లు ప్రకటించే అవకాశం ఉండటంతో సర్వే సంస్థలు ఓటర్ల మనోగతం తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని తెలుస్తోంది. కాంగ్రెస్, బీజేపీలు ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అభ్యర్థులను ఖరారు చేసేపనిలో ఉన్నాయి. ఎమ్మెల్యే సీట్లు ఆశిస్తున్న వారిలో ఎవరికి ప్రజల మద్దతు ఉందనే అంశాలను ఆయా పార్టీల వ్యూహకర్తలు సందేశాల ఆధారంగా ఫీడ్‌బ్యాక్ సేకరించే పనిలో నిమగ్నమవుతున్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఇందులో భాగంగా కులసంఘాలపై ప్రత్యేక దృష్టి సారించిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని అడ్డగుంటపల్లిలో శనివారం ఆరె కటిక సంఘ భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. స్థానిక 38వ డివిజన్‌లో రూ.10 లక్షల వ్యయంతో ఆరె కటిక సంఘ భవన నిర్మాణం చేపట్టామని ఆయన తెలిపారు. మరో రూ.10 లక్షలు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 38వ డివిజన్ కార్పొరేటర్ గడ్డి సరోజిని, 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, ఆరెకటిక సంఘం అధ్యక్షుడు గౌలికార్ రాము, ప్రధాన కార్యదర్శి గజభీంకార్ నర్సాజీ, చందు, కిరణ్‌జీ, భీమజీ, అనిల్, శ్రీనివాస్, సతీశ్, శివాజీ, నరేశ్, శంకర్, నందు, మహేశ్ పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

పాలకుర్తి(రామగుండం): రామగుండం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తయారు చేస్తామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కాగా, రామారావుపల్లి, పాలకుర్తి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, నాయకులు కౌశిక హరి, దుర్గం జగన్, కట్టెకోల వేణుగోపాలరావు, మల్లెత్తుల శ్రీనివాస్, శేర్ల లక్ష్మీపతి, గోంద్ర చందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా

గోదావరిఖని: బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త అరుణ్‌కుమార్ ఇటీవల ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి రూ.రెండు లక్షల బీమా మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు.

విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూడాలి



అల్పాహారం తింటున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కింద కూర్చుని అల్పాహారం తినడాన్ని గమనించిన అదనపు కలెక్టర్.. విద్యార్థులకు బెంచీలు సమకూర్చాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. కమాన్‌రోడ్డు (సుభాష్‌నగర్) పాఠశాలలో వృథాగా ఉన్న 25బెంచీలను తెప్పించి సమస్యకు పరిష్కారం చూపారు. విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం అందించాలని నిర్ణయించిందని, వారు కోరుకున్న టిఫిన్ సమకూర్చాలని నిర్వాహకులకు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, ఇన్‌చార్జి ఎంఈవో సురేందర్, హెచ్‌ఎం మంజులత ఉన్నారు.

ఓదెల మల్లన్న ఆలయ పాలకవర్గం నియామకం



మేకల మల్లేశంయాదవ్



బత్తుల రమేశ్‌బాబు

ఓదెల(పెద్దపల్లి): జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం ఓదెల శ్రీమల్లికార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా యాదవనేత, ప్రముఖ న్యాయవాది, బీఆర్ఎస్ నాయకుడు మేకల మల్లేశంయాదవ్ రెండోసారి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. పాలకవర్గసభ్యులుగా(డైరెక్టర్‌లు) బత్తుల రమేశ్‌బాబు, కనికిరెడ్డి సతీశ్, మ్యాడగొని శ్రీకాంత్‌గౌడ్, ఆరెల్లి మొండయ్యగౌడ్, రౌతు స్వర్ణలత, కర్రె కుమారస్వామి, గంప కిశోర్, పరిపాటి నరేందర్‌రెడ్డి, చింతం మొగిలి, దాసరి రాజయ్య, మూడెత్తుల శ్రీనివాస్, చింతం వెంకటస్వామి, రాపర్తి మల్లేశంగౌడ్, ప్రధాన అర్చకులుగా దూపం వీరభద్రయ్యను నియమించింది. తమ నియమాకానికి కృషిచేసిన దేవదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి పాలకవర్గం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, దేవస్థానం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ పేర్కొన్నారు. భక్తులకు అదనపు సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో ముందుకు వెళ్తానని అన్నారు.

ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్ జింఖానా స్టేడియంలో ఆదివారం జరిగే ముదిరాజుల ఆత్మగౌరవ సభను విజవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడుగు కృష్ణ ముదిరాజ్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పల్లె నుంచి పట్నం దాకా ముదిరాజ్‌లపై అవమానాలు, అణచివేత ధోరణులు అధికం అయ్యాయని తెలిపారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలు చేస్తున్న గడీల పాలనకు సమాధి కట్టేరోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యత నిస్తూ రానున్న ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ముదిరాజులు మేల్కొని ఆదివారం జరిగే ఆత్మగౌరవ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు తూడి రాజయ్య, గుర్రం సురేశ్, పిట్టల హనుమాన్లు, బొజ్జ శ్రీనివాస్, బర్ల మల్లయ్య, పిట్టల ఇస్తారే, కలవైన శ్రీనివాస్, పిట్టల కొమురయ్య, స్వరాజ్, పిడుగు సిద్ధార్థ, శివ, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆదాయం రూ.1.68 కోట్లు



వేములవాడ: వేములవాడ రాజన్నకు హుండీల ద్వారా రూ.1.68 కోట్ల ఆదాయం వచ్చింది. నగదుతోపాటు 242 గ్రాముల బంగారం, 13 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో ప్రతాప నవీన్ తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య శనివారం గుడిలోని ఓపెన్‌స్లాబ్‌లో హుండీ లెక్కింపు చేపట్టారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాదీవెన యాత్రకు స్పందన



గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: జనగామ, గంగానగర్‌లో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ శనివారం చేపట్టిన ప్రజాదీవెనయాత్రకు ప్రజల నుంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన జనగామ త్రిలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గడగడపకు కాంగ్రెస్ గ్యారెంటీలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.







ఆహ్లాదం.. ఆనందం

పెద్దపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ- గుండమ్మచెరువు మినీట్యాంక్ బండ్ ఆహ్లాదానికి చిరునామాగా మారాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి శనివారం మినీ ట్యాంక్ బండ్, బోటింగ్, కొత్త మున్సిపల్ భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే దాసరి శనివారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. మిషన్ కాకతీయ ఫేజ్–2లో భాగంగా ఎల్లమ్మ –గుండమ్మ చెరువులను పునరుద్ధరించామని ఎమ్మెల్యే దాసరి పేర్కొన్నారు. పర్యాటక శాఖ ద్వారా బోటింగ్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చామని అన్నారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి బోటింగ్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో గద్దరన్న యాదిలో..

- హాజరైన ప్రొఫెసర్ కాసీం, గద్దర్ తనయురాలు వెన్నెల
- సాంస్కృతిక కార్యక్రమాలతో దద్దరిల్లిన జెన్కో గ్రౌండ్
- పొరుగు జిల్లాల నుంచి భారీగా హాజరైన కళాకారులు



ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభలో ప్రముఖులు

రామగుండం: ప్రజాగాయకుడు, తెలంగాణ యాస, భాషలో తాను రచించి పాడిన పాటలతో ఉద్యమాన్ని ఉరకలెత్తి, ప్రజల్ని ఉర్రూతలూగించిన ప్రజా యుద్ధనౌక, దివంగత 'గద్దరన్న యాదిలో..' పేరిట శనివారం రాత్రి రామగుండం జెన్‌కో క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభ విజయవంతమైంది. పట్టణానికి చెందిన క్రియాశీలక గాయకుడు దయా గర్జన సారథ్యంలో ఏర్పాటు చేసిన గద్దర్ సంస్మరణ సభకు ప్రొఫెసర్ కాసీం, గద్దర్ తనయురాలు వెన్నెలతో పాటు జాతీయ, రాష్ట్రస్థాయి సాంస్కృతిక కళాకారులు, ప్రతినిధులు హాజరయ్యారు. గద్దర్‌తో కొనసాగించిన అనుబంధాన్ని ప్రతినిధులు గుర్తుచేసుకున్నారు. మందమర్రికి చెందిన సాంస్కృతిక కళాకారుడు తమ్మల శ్రీనివాస్ 'సింగరేణిలో లాసంటుండ్లు.. లాసు లాసంటుండ్రు.. లాసెట్లచ్చిందిరో అవినీతి అధికారుల్లారా..' అంటూ పాడిన పాట ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సాంస్కృతిక కళాబృందం ప్రతినిధులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లవరపుల వంశీ, కోల లక్ష్మణ్, విజయానంద్, కౌశిక హరి, జీడీ సారయ్య, కన్నూరి సతీశ్, కాసర్ల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగరేణి డైరెక్టర్‌తో సమావేశం

గోదావరిఖని: హైదరాబాద్ సింగరేణి భవన్‌లో యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల లాభాల విషయమై శనివారం సింగరేణి డైరెక్టర్ (పా) సమక్షంలో జరిగిన 13 కార్మిక సంఘాల సమావేశంలో పలు అంశాలను సంస్థ ముందుంచారు. ముఖ్యంగా మైనింగ్ స్టాఫ్, టెక్నీషియన్లు, ఏ, సీ గ్రేడ్, ఈపీ ఆపరేటర్ల సర్ఫేస్ సూటబుల్ జాబ్ ఇవ్వాలని కార్మిక సంఘాల ప్రతినిధులు కోరారు. ఇందుకు డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు చెల్లించాల్సిన 11వ వేతన ఎరియర్స్, సింగరేణి లాభాల వాటా చెల్లించాలని విన్నవించారు. ఈనెల 20వ తేదీలోగా ఏదో ఒకమొత్తాన్ని చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించినట్లు కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు.

బీఎస్పీ నాయకుల అరెస్టు

ఓదెల(పెద్దపల్లి): కనగర్తిలోని బీఎస్పీ నాయకులను పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో ముందస్తుగా శనివారం అరెస్టుచేశారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటారనే సమాచారంతో నాయకులు ఎండీ రియాజ్, కల్యాణం మహేశ్, బండ నిఖిల్‌కుమార్, దొడ్డి అశోక్, ఆవుల శ్రీనివాస్, శివను అదుపులోకి తీసుకున్నారు.

గౌడసంఘ కార్యవర్గం



పట్టణ గౌడసంఘ కార్యవర్గంతో నాయకులు

పెద్దపల్లిరూరల్: గౌడ సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని శనివారం ఖరారు చేశారు. సంఘ అధ్యక్షుడిగా కోట సమ్మయ్యగౌడ్, ఉపాధ్యక్షుడి రేగుంట సురేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా డైరెక్టర్లు కాయల శ్రీనివాస్, గంగాధర అంజయ్య, బొబ్బిలి రవీందర్, తిర్రి తిరుపతి, తిర్రి రాజు, తిర్రి శ్రీకాంత్, తిర్రి వెంకటేశం, భూషణవేన వేణు ఎన్నికయ్యారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

కమాన్‌పూర్: జూలపల్లి పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోని హుండీ పగులగొట్టి సుమారు రూ.20 వేల న నగదు ఎత్తికెళ్లారు. హుండీని ఆలయ సమీపంలో పడేశారు. శనివారం ఉదయం చోరీ జరిగిందని గుర్తించిన గ్రామస్తులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయుడిపై కేసు

ఓదెల(పెద్దపల్లి): ఓ పాఠశాలలో విద్యాబోధన చేస్తూ ఇటీవల రాష్ట్రప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయుడిపై ఎస్సీ ఎస్టీ, లైంగిక వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ శనివారం తెలిపారు. తోటి మహిళా టీచర్‌ను లైంగిక వేధించారని, కులం పేరుతో దూషించారని బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నిందితుడిపై ఎస్సీ ఎస్టీ, లైంగిక వేధింపుల చట్టం కింద కేసులు నమోదు చేశారు.

నియామకం



రామగుండం: పట్టణానికి చెందిన సుదగోని సతీశ్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు శనివారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఉన్నత చదువు.. పోలీస్ కొలువు



- జీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎం.ఫార్మసీ చదివి.. కానిస్టేబుళ్లుగా ఎంపిక
- తల్లిదండ్రుల కోరిక
- ప్రభుత్వ ఉద్యోగమంటే మక్కువ
- లక్ష్యాన్ని చేరుకున్న యువత



కరీంనగర్‌క్రైం: వారంతా.. బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎం.ఫార్మసీ వంటి ఉన్నత చదువులు చదివారు. తల్లిదండ్రుల కోరిక, ప్రభుత్వ ఉద్యోగం.. అందులోనూ పోలీస్ శాఖలో కొలువుపై మక్కువతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. చివరికి కానిస్టేబుళ్లుగా ఎంపికై, లక్ష్యాన్ని చేరుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అలాంటి అభ్యర్థులపై ప్రత్యేక కథనం.

పోలీస్ కావాలనుకున్నా..



మాది మంచిర్యాల. నేను ఎం.ఫార్మసీ చేశాను. చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలనుకున్న. అమ్మానాన్న రజిత–ఎల్లయ్య. నాన్న అటెండర్. వారి ప్రోత్సాహంతో ఉద్యోగం కరీంనగర్‌లో శిక్షణ తీసుకున్న. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా.

– తోకల అనూష, ఎం.ఫార్మసీ

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



చిన్ననాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం చేయాలని లక్ష్యం ఉండేది. అమ్మనాన్న సత్తమ్మ–నర్సయ్య. నాన్న తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎంబీఏ చేశాను. కరీంనగర్‌లో కోచింగ్ తీసుకొని, సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– ప్రవళిక, ఎంబీఏ

అమ్మానాన్న కల



మాది అంతర్గాం మండలంలోని మద్దిరాల. నేను పోలీస్ కావాలనేది మా అమ్మానాన్న పద్మ–లింగయ్య కల. ప్రస్తుతం ఎమ్మెస్సీ మ్యాథమేటిక్స్ చదువుతున్న. కరీంనగర్‌లో శిక్షణ పొంది, టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– మాటేటి సందీప్, ఎమ్మెస్సీ మ్యాథమేటిక్స్

ఇది నాలుగో కొలువు



నేను ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఓయూలో పూర్తి చేశాను. ప్రస్తుతం సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. ఇది నాకు నాలుగో ప్రభుత్వ కొలువు. మొదట ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా, తర్వాత జైల్ వార్డెన్‌గా, పంచాయతీ సెక్రటరీ ఉద్యోగాలు వచ్చాయి. కానీ వెళ్లలేదు.అమ్మనా న్న, భార్య ప్రోత్సాహంతోనే సాధించగలిగా ను.

– కృష్ణంరాజు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ

నాన్న స్ఫూర్తితోనే..



రామడుగు: నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. మా నాన్న హెడ్ కానిస్టేబుల్. ఆయన స్ఫూర్తితోనే నేను ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. చాలా సంతోషంగా ఉంది.

దూలుముట్టి సాహిత్‌రెడ్డి, బీటెక్

అమ్మా, తమ్ముడు చదివించారు



సైదాపూర్: నాన్న చిన్నతనంలోనే చనిపోయాడు. అమ్మ బట్టలు కుడుతూ, తమ్ముడు కూలీ పనులు చేస్తూ నన్ను ఎం.టెక్ చదివించారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ.. రెండుసార్లు మెయిన్స్‌లో ఫెయిలయ్యాను. పేదరికం కారణంగా కోచింగ్ తీసుకోకుండానే మూడో ప్రయత్నంలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

నాంపల్లి శివకుమార్, ఎం.టెక్

ప్రైవేటు ఇంజినీర్‌గా చేస్తూ..



రుద్రంగి: మాది రుద్రంగి. నేను బీటెక్ చదివాను. ప్రైవేటు ఇంజినీర్‌గా పనిచేస్తూనే పోలీస్ ఉద్యోగం అంటే ఇష్టంతో ఎస్సై పోస్టుకు దరఖాస్తు చేశాను. రెండు మార్కుల తేడాతో ఆ ఉద్యోగం కోల్పోయాను. ప్రస్తుతం ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– బాసని సూర్యప్రకాశ్, బీటెక్

నాన్న కోరిక..



బోయినపల్లి(చొప్పదండి): మాది తడగొండ గ్రామం. నేను బీటెక్ చదివాను. నాన్న తిరుపతిరెడ్డికి నేను ఎస్సై కావాలని కోరిక. ఇటీవల ఎస్సై పరీక్షా ఫలితాల్లో కొద్దిలో జాబ్ మిస్సయ్యాను. ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది.

– గోగూరి సాయికృష్ణారెడ్డి, బీటెక్

ప్రభుత్వ ఉద్యోగం చేయాలని..



చందుర్తి(వేములవాడ): మాది మల్యాల గ్రామం. నేను ఎంబీఏ పూర్తి చేశాను. నాన్న నర్సయ్య వ్యవసాయం, అమ్మ లక్ష్మి బీడీలు చేస్తున్నారు. రెండేళ్లుగా ఓ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతు న్న. ప్రస్తుతం కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– మేరుగు ఉదయ్, ఎంబీఏ

నాన్న పోలీస్ అవ్వాలనేవారు



మాది కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్. నాన్న తిరుపతి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 20 13లో గుండెపోటుతో చనిపోయా రు. నాకు ఒక అక్క, చెల్లి ఉన్నారు. మాలో ఒకరు పోలీస్ అవ్వాలని నాన్న అనేవారు. నేను ఎ మ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి, ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపిక య్యా.

– కట్ట సాయిచైతన్య, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ

ఆనందంగా ఉంది



రుద్రంగి: మాది రుద్రంగి. అమ్మానాన్న నన్ను ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలని కలలుగన్నారు. వాటిని నిజం చేస్తూ నేను ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. వారి కోరిక తీర్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

తోకల శశిధర్, బీటెక్

పోలీస్ కావాలన్నదే కోరిక



కోరుట్ల రూరల్: మాది పైడిమడుగు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాను. ఏదో ఒకరోజు పోలీస్ కావాలన్నదే నా కోరిక. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకొని, మొదటి ప్రయత్నంలోనే ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– దొమ్మటి మణిదీప్, బీటెక్

పోలీస్ డ్రెస్ అంటే ఇష్టం



కోరుట్ల రూరల్: మాది పైడిమడుగు. నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ డ్రెస్ అంటే ఇష్టం. బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేశా. హైదరాబాద్‌లో పోలీస్ కోచింగ్ తీసుకొని, మొదటి ప్రయత్నంలోనే ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– అరిసె రోహిత్,

జైల్ వార్డెన్‌గా ఎంపికయ్యా



మల్యాల: మాది తాటిపల్లి అనుబంధ గ్రామం కొంపల్లి. అమ్మానాన్నా కమల–గంగారాం. నేను ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశాను. గ్రూప్స్‌కి సన్నద్ధమై, కానిస్టేబుల్ పరీక్ష రాసి, జైల్ వార్డెన్ ఉద్యోగానికి ఎంపికయ్యా.

కల్లెం మహేందర్, ఎంఏ ఎకనామిక్స్

వ్యవసాయ పనులకు వెళ్తూ..



ఎల్లారెడ్డిపేట: మాది అక్కపల్లి గ్రామం. అమ్మానాన్న రాజవ్వ–కొమురయ్య. నేను వ్యవసాయ పనులకు వెళ్తూ బీటెక్ వరకు చదివా. అమ్మానాన్న కష్టం చూసి, ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకున్న.సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– మమత, బీటెక్

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం వదిలి..



ఎల్లారెడ్డిపేట: మాది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం. అమ్మానాన్న వరలక్ష్మి–కుబేరస్వామి. నేను ఎంటెక్ పూర్తి చేశాను. హైదరాబాద్‌లోని ఓ ప్రై వేటు ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న. నాన్న ప్రభుత్వ టీచర్. నేను ఉద్యోగం వదిలేసి, ఇంటి వద్దే చదివి, సివిల్ కా నిస్టేబు ల్ ఉద్యోగం సాధించా. సాయి రామకృష్ణ, ఎం.టెక్

మొదటి ప్రయత్నంలోనే..



వేములవాడరూరల్: మాది చెక్కపల్లి. నేను ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. ప్రభుత్వ, బ్యాంకు ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతుండగా కానిస్టేబుల్ నోటిఫికేషన్ వచ్చింది. దీంతో సన్నద్ధమై, మొదటి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

మెతుకు మమత, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్

అన్నయ్య స్ఫూర్తితో..



కోల్‌సిటీ: నాన్న ధర్మారావు రైతు. అమ్మ లక్ష్మి గృహిణి. అన్నయ్య సివిల్ కానిస్టేబల్. అన్నయ్య స్ఫూర్తితో పోలీస్ కొలువు సాధించాలనేది లక్ష్యం. తొలిప్రయత్నం విఫలమైంది. మరింత పట్టుదలతో రెండోసారి సివిల్ కానిస్టేబుల్ కొలువు సాధించిన.

– కొమ్మరినేని ధర్మేందర్‌రావు, బీకాం కంప్యూటర్స్, ముస్త్యాల

ఎస్సై కొలువు లక్ష్యం



కోల్‌సిటీ: నాన్న మల్లయ్య మేస్త్రీ, అమ్మ లక్ష్మి గృహిణి. గోదావరిఖనిలో మూడు నెలల శిక్షణ తీసుకున్న. ఎస్సై జాబ్ కోసం పరీక్ష రాస్తే రాలేదు. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన. చాలా సంతోషంగా ఉంది. ఎలాగైనా ఎస్సై కొలువ సాధిస్తా..

– తడకపెల్లి అనిల్‌కుమార్, బీటెక్(మెకానికల్), తెలుకుంట, జూలపల్లి

సివిల్స్ సాధిస్తా



కోల్‌సిటీ: నాన్న శ్రీనివాస్ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుడు. అమ్మ మమత. సివిల్స్‌లో జాబ్ కొట్టాలని నా ఆశ. చాలా ప్రిపేర్ అయ్యా. కానీ గ్రూప్–1 వాయిదా పడింది. ఇప్పుడు ఓపెన్ కేటగిరీలో ఫైర్ విభాగంలో ఉద్యోగం వచ్చింది. ఈ కొలువు చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేరవుత.

– గుంటుకు వివేక్, బీటెక్ (మెకానికల్), గోదావరిఖని

అనుకోకుండా వచ్చింది



కోల్‌సిటీ: నాన్న నారాయణ, అమ్మ లక్ష్మి. చిన్నవ్యాపారం చేస్తడు. గోదావరిఖనిలో పోలీసు ఉద్యోగం శిక్షణ తీసుకున్న. కానీ, అనుకోకుండా ఐటీ, కమ్యూనికేషన్ సెల్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. హ్యాపీగా ఉంది.

– ఈర్ల సాయికిరణ్, బీటెక్(ఎలక్ట్రానిక్స్), మల్యాలపల్లి

ప్రాజెక్ట్ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న కార్మికులు, అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 జీవిత కాలపరితి నాలుగేళ్లు పెంచిన సందర్భంగా కార్మికులు సంబురాలు చేసుకున్నారు. ఈమేరకు ప్రాజెక్ట్ అధికారి రాధాకృష్ణను శనివారం అధికారులు, కార్మికులు సన్మానించారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాస్, ఎస్‌వోఎం ఉదయ్‌హరిజన్, నాన్ ఆఫరేషన్ ఫిట్ సెక్రటరీ భద్రాచలం, ఆర్జీ–3 అండ్ ఏపీఏ బ్రాంచ్ సెక్రటరీ జక్కుల దామోదర్, ఓసీపీ–1 ఫిట్ సెక్రటరీ మల్లయ్య, వర్క్‌మేన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ అండ్ పీసీ ఫిట్ సెక్రటరీ ఎల్లయ్య, సేఫ్టీ కమిటీ సభ్యులు వెంకటయ్య, మల్లయ్య, బాబురావు, ఐలయ్య, రాంరెడ్డి, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవి, ఆనంద్, అమరేందర్‌రావు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఐలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సీహెచ్‌పీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఓసీపీ–3 సీహెచ్‌పీని సందర్శించి కార్మికులతో మా ట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. కార్మికుల సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వీడాలని కోరారు. సత్యం, సుందర్, కోటేశ్వరరావు, కనకయ్య, రమేశ్, శంకర్, మల్లేశ్, ప్రభాకర్, కుమార్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు సింగరేణి ప్రోత్సాహం

రామగిరి: సింగరేణి సంస్థ క్రీడలను ప్రోత్సహిస్తుందని ఆర్జీ–3, ఏపీఏ ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, డి.బైద్య అన్నారు. శనివారం స్థానిక రాణీరుద్రమదేవి క్రీడా ప్రాంగాణంలో ప్రాంతీయస్థాయి కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని కోల్ ఇండియాస్థాయిలో సింగరేణి కీర్తి పతాకం ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం కె.మారుతి, సీనియర్ పర్సనల్ అధికారి రాజేశం, సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్ష శ్రీనివాస్, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందిపై దాడి

రామగిరి: ఆర్జీ–3 జీఎం కార్యాలయ అవరణలో శనివారం రాత్రి ఎస్‌అండ్ పీసీ సిబ్బంది నాగయ్యపై లద్నాపూర్ సర్పంచ్ భర్త బడికల శ్రీనివాస్ దాడి చేశారు. గ్రామస్తులతో కలిసి జీఎంను కలిసేందుకు వచ్చిన శ్రీనివాస్, ఇద్దరు వ్యక్తులు అరుస్తుండగా వారించడంతో తనపై దాడిచేశారని బాధితుడు నాగయ్య తెలిపాడు. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఎట్టకేలకు పంచాయతీ తీర్మానం

సాక్షి ఎఫెక్ట్..

ధర్మారం: కటికెనపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సర్పంచ్ కారుపాకల రాజయ్య ఆధ్వర్యంలో పాలకవర్గ శనివారం తీర్మానించింది. తద్వారా 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు మోక్షం లభించినట్లయ్యింది. విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరై ఐదేళ్ల గడిచినా.. స్థలం చూపించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే సారాంశంతో ఈనెల 3న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ స్పందించి ఈ తీర్మానం చేయించారు. కాపీని ఆర్ఐ వినోద్‌కు అందించారు. సర్వే నంబరు 1255లోని ప్రభుత్వం భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం పంచాయతీ తీర్మానించి ఇవ్వాలని మండల రెవెన్యూ అధికారి రజిత ఇటీవల సూచించారు. అయితే, ఇందులోనే కొందరికి పట్టాలు ఉన్నాయంటూ తీర్మానం ఇవ్వడానికి జాప్యం చేశారు. ఎట్టకేవలకు సర్పంచ్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినోద్. పట్టాదారులతో కలిసి శనివారం మోఖాపై వెళ్లారు. సమస్యను సామరస్యంగా చర్చించి పరిష్కరించారు.

రూ.21వేల వేతనం చెల్లించండి

కోల్‌సిటీ(రామగుండం): మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఆంధ్రప్రదేశ్‌లో నెలకు రూ.21,000 వేతనం చెల్లిస్తున్నారని, తెలంగాణలో కూడా అదే వేతనం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సి పల్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె చేస్తారని తెలిపారు. గోదావరిఖని సీఐటీయూ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు వై.యాకయ్య, జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి మాట్లాడారు. కేటగిరీల ఆధారంగా వేతనాలు చెల్లించాలని, అన్నిమున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో కార్మికులను పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల నుంచే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.నాగమణి, కార్పొరేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు కిషన్ నాయక్, సత్యం ఉన్నారు.

కిలో గంజాయి పట్టివేత

- ఇద్దరు యువకుల రిమాండ్



పట్టుకున్న గంజాయి, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాదరావు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో గంజాయి విక్రయాలకు చెక్ పెట్టడానికి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని, వారినుంచి కిలో గంజాయిని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ 2వ సీఐ ప్రసాదరావు కథనం ప్రకారం.. స్థానిక ఉదయ్‌నగర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులుకు ప్లాస్టిక్ సంచులతో అనుమానాస్పదంగా తిరుగుతున్న చిక్కుడు రాహుల్, సాయితేజ కనిపించారు. వారిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. అనుమానంతో సంచుల్లో తనిఖీ చేయగా సుమారు రూ.25వేల విలువైన కిలో గంజాయి లభించింది. వారిని విచారించగా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి గోదావరిఖనిలో కార్మికులు, యువతకు విక్రయించి అధికంగా డబ్బులు సంపాదిస్తామని చెప్పారని పేర్కొన్నారు ఈమేరకు వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రామగుండం తహసీల్దార్ సమక్షంలో పంచనామా చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న క్రైం పార్టీ పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.